19082024-DIS-04_Layout 1 8/19/2024 3:17 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

పంతం

కాలింగ్ బెల్
గాయత్రీ మంత్రం చదువుతుంది
లేదా, వీధి తలుపు
ఆంజనేయ దండకం అందుకుంటుంది
నీ సకల చరాచర స్వప్నాలనూ, కోరికలనూ
విడిచిపెట్టి–
విష్ణుమూర్తిలా వెళ్లి
గబుక్కున తలుపులు తెరుస్తావ్,
అంతవరకే నీకు తెలుస్తుంది,
తర్వాతదంతా ప్రపంచం చెప్పుకుంటుంది
– వచ్చింది మృత్యువని.

ప్రియురాలా, మనకేం తెలుసు –
ఏమో, మరో క్షణంలో
మన తలుపు ఎవరు కొడతారో?
నీకసలే కంగారెక్కువ –
గబుక్కున వెళ్లి తెరిచేయకు సుమీ.

నడి మధ్యలో కలిసినా,
మనకు దొరికినది నడమంత్రపు సిరి కాదు.
అయినా, క్షణాల్లో ఎంతదూరం వచ్చేశామో.
తలచుకుంటే ధైర్యంతో గుండెలుప్పొంగవూ?

సముద్ర పక్షులన్నీ నడుల్లో ఈతకెళ్లినట్టు
మనమింకా దేనికోసమని దేవులాడటం?
ఇంటి మీంచి విమానం వెళ్తున్న చప్పుడేదో
చివరిసారిగా వింటాం,
నువ్వో నేనో– మాత్రం చెప్పలేం!

వారసులెవరో శిథిలాలన్నీ జమ చేస్తారని భీమా
కావమ్మ, లేక చెల్లాచెదురుగా విసిరేయొచ్చు
చెరిపేయొచ్చు, యాంటీవైరస్ వాడి.
మనకు తెలియనప్పుడు దుఃఖమేల?

చల్లారిన గుసగుసలతో..
చప్పబడిన గుండెలతో
బలంగా కౌగిలించుకునే వుందాం –
మార్కండేయుడిలా.
చివరి నిర్ణయంలోనూ
ఓ చిరు సవాల్ విసురుదాం
ఎప్పటి, నీ పంతంలాగే



దేశరాజు

ప్రపంచతంత్ర కథలు రావాలి

తెలంగాణలో బాల సాహిత్యం విరివిగా వస్తున్నది. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలపై చిన్నపిల్లలకు అవగాహన కలిగించాలనే ఉద్యేశంతో విద్యాశాఖ కొత్త పాఠ్యాంశాలకు రూపకల్పన చేయడమే ఇందుకు కారణం. 6 నుంచి 10వ తరగతి వరకు గల తెలుగు పాఠ్య పుస్తకాల్లో పాఠం చివర సృజనాత్మకత, ప్రశంస ఉండేలా పాఠ్య పుస్తక రచయితలు ఏర్పాటుచేశారు. ఇందులో కథ, కవిత, సంభాషణ, లేఖారచనా, కరపత్రం, ఇంటర్వ్యూ, పుస్తక సమీక్ష వంటి సాహితీ ప్రక్రియలపై ప్రశ్నలుంటాయి. పరీక్షల్లోనూ వాటికి మార్కులుంటాయి. కాబట్టి విద్యార్థులు తప్పకుండా వీటిని చదవడం, రాయడం చేస్తున్నారు.

> విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయించే కార్యక్రమంలో భాగంగానే, తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక రచనల్లో తర్ఫీదునిస్తున్నారు. ఇది పిల్లల ఆలోచనలకు రెక్కలు తొడిగి, సృజనకారులుగా తయారవడానికి ఎంతో దోహదం చేస్తున్నది. నిబద్ధత, రచనారంగంలో కొంత ప్రవేశం ఉన్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహిస్తూ, వారినుంచి మరిన్ని రచనలు రావడానికి కృషిచేస్తున్నారు.

ఖమ్మం జిల్లా అశ్వరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కన్నెగంటి వెంకటయ్య తన సంపాదకత్వంలో 'చిగురాకుల సవ్వడి' పేరుతో పిల్లలు రాసిన వచన కవితలను 2003లో సంకలనంగా తీసుకువచ్చారు. ముస్తాబాద్ పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తున్న గరిపల్లి అశోక్ 2014లో తను సంపాదకుడిగా, పిల్లలతో 'జాంపండ్లు' కథా సంకలనాన్ని తీసుకువచ్చారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థుల రచనలతో సంకలనాలు వెలువడ్డాయి. ఇటీవలే వచ్చిన షాద్‌నగర్ పిల్లలు రాసిన 'రంగుల ప్రపంచం' కథా సంకలనం వరకూ 142 పుస్తకాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలోని సుమారు 4 వేల మంది బాలబాలికలు కల్పనాత్మక రచనలు చేస్తున్నారని ఒక అంచనా.

సంకలనాల సంగతి అలా ఉంచితే, తెలుగులో వెలువడే దిన, వారపత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, మాస పత్రికల్లో కలిపి వారానికి సుమారు నలభై పిల్లల కథలు వస్తున్నాయని విజ్ఞుల అభిప్రాయం. బాల సాహిత్యం రాసే రచయితలతో పాటు, పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థిని, విద్యార్థులు కూడా పత్రికలకు రాయడం ప్రారంభించారు. ఇది ఆహ్వానించదగిన పరిణామం. నెలకు సుమారు 150కి పైగా పిల్లల కథలు పలు పత్రికల్లో వెలుగుచూస్తున్నాయి. రాశిలో ఇంత ఎక్కువగా వస్తున్నా, కథల్లో వాసి తగ్గిపోతున్నదని, మనసుదాకా చేరడం లేదని సీనియర్ రచయితల అభిప్రాయం. ఇందులో వాస్తవం లేకపోలేదు. బాలసాహిత్య రచయితలకు సరైన మార్గదర్శకత్వం కొరవడటం వల్లనే ఇలా జరుగుతుందన్నది నిష్ఠుర సత్యం.

> రచయితలు సాధారణంగా కథల్లో చేస్తున్న పొరపాట్ల గురించి చూద్దాం. ఇటీవల ఒక కథ పత్రికలో వచ్చింది. ఈ కథ అవగాహన లోపంతో రాసింది. 'కొంతమంది వేట గాళ్లు అడవికి వచ్చి, ఏనుగును బంధించాలని, అది వచ్చేదారిలో ఉచ్చులు ఏర్పాటు చేశారు' అని రచయిత రాశారు.

సాధారణంగా ఏనుగును పట్టుకోవడానికి పెద్ద గోయి తవ్వి, దాని మీద సన్నటి పుల్లలు పేర్చి, వాటిమీద చాప లేదా వస్త్రం వంటిది కప్పి, పైన కనిపించకుండా మట్టి చల్లి ఆకులు కప్పుతారు. అనుమానం రాకుండా ఈ ఏర్పాటు చేసి, ఏనుగు గోతిలో పడేలా చేస్తారు. తర్వాత తాళ్లతో బంధించి దంతాలు కోసుకుంటారు. ఎంత పెద్ద ఉచ్చులు వేసినా, ఏనుగు బలం ముందు అవి బలాదూరే. ఉచ్చులు పిట్టలకు వేస్తారు. మరో రచయిత రాసిన కథ చదివి ఆశ్చర్యపోయా. ఆ కథలో గాడిదకు చక్కగా పాటలు పాడాలని ఉంటుంది. అది ఏ జంతువును అడిగినా నేర్పువు. అయినా తను అదేపనిగా పాటలు పాడుతుంది. దాని గాత్రానికి అడవిలోని జంతువులన్నీ గాడిదను అసహ్యించుకుంటాయి. అది చిన్నబుచ్చుకుంటుంది. అప్పుడు కోకిల వచ్చి గాడిదకు, పాడటం నేర్పిస్తుంది. అది చక్కగా పాడుతుంటుంది. ఇదీ కథ. కొన్ని జంతువులకు, పక్షులకు సహజసిద్ధంగా పుట్టుకతోనే కొన్ని లక్షణాలు వస్తాయి. లేడి వేగంగా పరిగెత్తడం, గద్ద దీర్ఘదృష్టి కలిగి ఉండటం మొదలైనవి. ఎంత కోకిల శిక్షణ ఇచ్చినా గాడిద కంఠస్వరంలో మార్పు వస్తుందా? రచయిత వస్తువును తీసుకునేటప్పుడే జాగ్రత్తగా ఆలోచించాలి. మనం రాసే కథ చదువరులకు నమ్మకం కలిగించేలా ఉండాలి. ఎక్కువ కథ లు రాయాలనే తొందరలో రచయితలు ఇలాంటి పొరపాట్లు చేస్తుంటారు.

పుప్పాల కృష్ణమూర్తి

ఇంక రాజుల కథలు రాసేటప్పుడు రమేశ్, నరేశ్, పరిమళ, ప్రహేళిక అనే ఆధునిక పేర్లను వాడుతున్నారు. రాజుల కాలంలో ఇంత నాగరికమైన పేర్లు లేవు. నాగమ్మ, కాటమయ్య, బొందయ్య మొదలైన ప్రాచీన పేర్లను ఉపయోగిస్తేనే, కథ వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. ఇలాంటి చాలా విషయాల పట్ల బాల రచయితలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. బాలల కథలు రాస్తున్న రచయితలు కూడా పై విషయాలను గమనంలో ఉంచుకోవాలి.

ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం పొందిన పి.చంద్రశేఖర్ ఆజాద్‌ను ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు గొప్ప మాట చెప్పారు.

'మన తెలుగు బాల రచయితలు ఇంకా క్రీ.పూ.3 నుంచి 5వ శతాబ్దం మధ్యలో రాయబడిన పంచతంత్ర కథల దగ్గరే ఉన్నారు. ప్రపంచం ఎంత మారింది. పిల్లలు ఎన్నో అద్భుతాలు చేస్తున్నారు. ఈ కార్పొరేట్ చదువుల్లో ఎంత సంఘర్షణ అనుభవిస్తున్నారు. రాయడానికి ఎంతో విశాలమైన ప్రపం చం ఉన్నది. రచయితలు కొత్త దారులు తొక్కాలి. పుస్తకాలకు దూరమై, టీవీ, సెల్ ఫోన్లకు బానిసలవుతున్న బాలలను మన వైపు మలుచుకునే మంచి రచనలు రావాలి'

అని సూచించారు. బాలసాహిత్య రచయితలు ఆ దిశగా కలాన్ని కదిలిస్తారని ఆశిద్దాం.

చరకుడు

పోలికలు స్థిరపడని రూపాలకు
ఆనవాళ్లిచ్చిన రూపకర్త.
పుటకనిచ్చిన బ్రహ్మ ఊహకూ
జన్మనిచ్చిన అమ్మలకూ మధ్య
సాకార సారూప్య వారథి.
స్వస్థతకు కేశ నిర్వహణే
మూల వైద్యమన్న చరకుడు
దుర్గమ కేశారణ్యంలో చిక్కువడిన
కర్మేంద్రియాల విధిని
సుగమం చేసిన రోగహరి.
ఆజానుబాహులకూ అరవింద నేత్రులకూ
మూర్తిమత్వ పూర్ణతనిచ్చిన కూర్పరి.

రథోత్సవాలకూ వాహన సేవలకూ
దివిటీలై కాలి
నాదస్వరాల రాగ వాహినిలో
ఊపిరులై ప్రవహించి
తగిలితేనే స్నానం చేసే ధర్మాల
మనోధర్మంలో మసిబారిన
మనిషితనం మంగలి.
పుట్టు వెంట్రుకల నుంచి సావుదినం దాకా
అవసరమై నిలబడి కత్తిలా కలబడి
ఒసుగు బిచ్చం కోరే
గడప అవతలి పంచె మంగలి.

తెర మీది శిరోజాల సొరును
శిరసున ముద్రించే లాఘవం
వాడలకొద్ది హీరోలకు జన్మనిచ్చి
జీరోగా మిగిలే జీవి.
వెర్రెత్తిన కుర్రకారు హుషారు 'కీ'.
ఖండనాల ముండనాల దండనాయకుడు.
తెగేసి చెక్కగల శిల్పి
తెరువు తెలిసిన తెగువరి.

వంచిన తలలకు తలెత్తుకునే యోగాన్నిచ్చి
మాసిన జుట్టును మల్లె తోటగా విప్పార్చి
పగిలిన అద్దాల మీద
ముక్కలవుతున్న మురికి రవిబింబం.

సెలూన్ల సెగ ధగల్లో
బెలూన్లలా పేలి రాలిపోతూ
కార్పొ 'రేటు' కత్తెర దారిలో
దారు పట్టక తుప్పు పట్టిన
అతార మంగలి.

గొరుగుతున్నప్పుడు కులాన్ని అడగని
సమతా సౌందర్య దాత
కత్తి లాగే బతుకూ అరుగుతున్నప్పుడు
'కల్ప'నీ కాలాన్నీ ప్రశ్నించని
వృత్తి వృత్తంలో జీవిత ఖైదీ
ఊడ్చేసిన వెంట్రుకల కుప్పలో
మూలుగుతున్న కులకళ్పి వేరు.
బుసకొట్టే నాగరికతల కాటుకి
కమిలిపోతున్న బతుకు కాటుక.
అంగడిలో అగ్వకౌలు ప్రాణి
వేణీ సంహార సమరంలో
వేళ్లు తెగుతున్న యోధుడు

(మంగలి రాములు స్మృతిలో..)

వఝుల శివకుమార్
94418 83210

కథలకు ఆహ్వానం

2024–దీపావళి పండుగను పురస్కరించుకొని 'డాక్టర్ అమృతలత–పాలపిట్ట' సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీని నిర్వహిస్తున్నాం. ఇతివృత్తం రచయితల అభీష్టం. సామాజిక కల్లోలాలే కాదు, మానవ అంతరంగాల్లోని ఘర్షణలనూ ఇతివృత్తాలుగా ఎంపిక చేసుకోవచ్చు. మొదటి బహుమతి–రూ.10 వేలు, రెండో బహుమతి: రూ.6 వేలు, మూడో బహుమతి: రూ.4 వేలు, మరో పది కథలను ప్రత్యేక బహుమతులుగా ఎంపికచేసి ఒక్కో కథకు రూ.1000 బహుమతిగా ఇవ్వనున్నాం. కథల ఎంపిక లో 'పాలపిట్ట' సంపాదకవర్గానిదే తుది నిర్ణ యం. ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. పోటీలో ఎంపికయ్యే కథలు 'పాలపిట్ట'లో ప్రచురితమవుతాయి. కథలు పంపడానికి చివరి తేదీ 2024, సెప్టెంబర్ 25, ఫలితాలు ప్రకటించే తేదీ 2024, అక్టోబర్ 15. కథలు పంపవలసిన చిరునామా ఎడిట ర్ పాలపిట్ట, ప్లాట్ నెం–3, బ్లాక్–6, ఏపీహెచ్‌బీ, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–044. ఫోన్:94900 99327, palapitta books @gmail.com

– గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట

కరీంనగర్ కవితావరణం

> నాడు, నేడు కవులది ఒకే చూపు, ఒకే దారి. సూర్యోదయపు తొలి కిరణాలను అందిపుచ్చుకొని పొద్దు పొడుపుల వెంట చైతన్యం వైపు పరుగులు తీయడం. ఇందుకు కరీంనగర్ కవులు మినహాయింపేమీ కాదు. తడి ఆరని ఆంధ్ర మహాసభ జ్ఞాపకాలు, సాయుధ రైతాంగ పోరాటపు గాయాల సలపరింపు, భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు సంఘటనలు, సిరిసిల్ల జగిత్యాల కల్లోల కలవరింపు, తెలంగాణ రాష్ట్ర తొలి, మలి ఉద్యమాల ఉడుకు రక్తం.. ఇక్కడి కవులు, కళాకారులను అనుక్షణం కలవరపెడుతూనే ఉన్నాయి. పోరాటాలు, ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చిన కవులే కాదు, సాంఘిక, సామాజిక, ఆర్థిక అసమానతల నుంచి పుట్టుకొచ్చిన కవులు కూడా ఉన్నారు.

శతాబ్దాల కాలం నాటి వేములవాడ భీమకవి నాటిన లలితకళల విత్తనాలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కవులు పుట్టిన నేల ఇది. కాలం వెంట కదులుతున్న కవులు, తెలుగు భాషకు నడకనేర్పిన రచయితలు, పాటకు ప్రాణం పోసిన గాయకులు.. ఈ నేల నేలంతా పచ్చటి మాగాణంతో పరిమళాలు వెదజల్లుతున్నది. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ వచ్చిన కవితా సంపుటాలు, కథా సంకలనాలు, నవలా సాహిత్యం 'విశ్వంభర'ను తాకాయి. ఎందరో సాహిత్యకారులను చైతన్యవంతులను చేసి, వాళ్ల దృష్టిని పేద ప్రజల జీవితాల్లోని బాధల వైపు, సమస్యల వైపు, పోరాటాల వైపు మళ్లించింది. తాజాగా వెలువడిన 'కరీంనగర్ కవులు నాడు నేడు' వంద రెండు కవితల సంకలనం ఇందుకు నిలువుటద్దం.

మాతృభూమి మీది మమకారంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి చెందిన పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య ముందుకువచ్చి నూటా ఇద్దరు కవుల కవితలతో ఆనాటి, ఈనాటి పద్యాలు, కవితలను మన ముందుకుతెచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ కవులందరూ ఆర్థిక స్వేచ్ఛ, సాంఘిక స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ ముఖ్యంగా ఇవన్నీ కలగలసిన స్వేచ్ఛతో తమ భావాలను పటిష్ఠంగా మనస్సుకు హత్తుకునేట్లు వ్యక్తం చేశారు. 10వ శతాబ్ది నాటి జినవల్లభుడు, వేములవాడ భీమకవి, చరిగొండ ధర్మన్న, మల్లియ రేచన, ఎలిగందుల నారయ, మడికి సింగన, మామిడిపల్లి సాంబశివ శర్మ, సినారె, వానమామలై, బాపురెడ్డి తదితరులు నాటి కవులు, నేటి కవులు జూకంటి, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, వారాల ఆనంద్, రాజేందర్ జింబో, వెల్దండి శ్రీధర్, గాజోజు నాగభూషణం తదితరులు 102 మంది కవితల సంకలనం ఇది.

కోడం పవన్‌కుమార్
98489 92825

తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా కల్పించిన తొలి కందపద్యాలు రాసిన కవి జిన వల్లభుడు. జిన భవనాలు కట్టించడం, జిన సాధువులకు పూజలు చేయడం, జినమునులకు నచ్చిన భోజనాలు పెట్టడంలో ఇతర జైనులెవ్వరినీ జిన వల్లభునితో సరిపోల్చలేం. సూర్యుడితో సమానంగా వెలుగు వారు, జిన వల్లభునితో సరితూగు మరే కవులు లేరు. ఒక్కొక్కరు ఒక్కొక్క సుగుణంతో ఉంటారు. ఆలోచించి చూస్తే జిన వల్లభుడే గుణమణి. పైగా ఆయన 'గుణపక్ష పాతి' అనే అర్థంతో మొదలైన కంద పద్యం ఈ సంకలనానికి తొలి పద్య కవిత జిల్లాలోని గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని వృషభగిరి అనే బొమ్మలమ్మ గుట్టపై చెక్కబడి ఉంది. అలాగే 11వ శతాబ్దికి చెందిన కవి వేములవాడ భీమకవికి చెందిన చాటువులు ప్రజాదరణ పొందినవి. నన్నయ్య తర్వాత, తిక్కన్న కంటే ముందు జీవించి సమాజంలోని అసమానతలపై చాటువు శైలిలో పద్యాలు రాశాడు. ఈ మహాకవి స్మారకార్థం 1935లో సిరిసిల్లలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ వేదికకు 'భీమకవి నగర్'గా పేరు పెట్టడం విశేషం. మరో కవి మల్లియ రేచన తెలుగులో మొదటి ఛందో గ్రంథం రాసిన వాడు. వేములవాడకు చెందిన రేచన ఎంతో మంది కవులకు ఆశ్రయమిచ్చాడు, పోషించాడు. కంద పద్యాలతో కూడుకున్న 'కవిజనాశ్రయము' అనే విలక్షణమైన గ్రంథాన్ని రాశాడు. 15వ శతాబ్దానికి చెందిన మడికి సింగన రచించిన 'సకల నీతి సమ్మతము' గ్రంథంలోని పద్యాలన్నీ రాజ్యాంగంలోని అన్నివర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకుసాగడానికి నీతి మార్గాలను బోధించాడు. ఆ తర్వాత 20వ శతాబ్దం తొలితరం కవులలో మామిడిపల్లి సాంబశివ శర్మ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, వానమామలై, బాపురెడ్డి తదితరులు మారుతున్న సమాజానికి అనుగుణంగా పద్య, వచన కవితలు రాశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేల సంఖ్యలో కవులున్నారు. 102 మందితో ఈ సంకలనం మనకు సమగ్రతను అందివ్వదు. మరింతమంది కవులతో ఇలాంటి సంకలనాలు మరిన్ని రావడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.

సిగ్గు పడుతున్న

నేను
చేవ చచ్చిన కలాన్ని మాట్లాడుతున్న
నన్ను, మట్టిలో కప్పిపెడితే గన్నే లేని
అక్షరాలను తూటాల్లా మలిచి
దోపిడిపై యుద్ధం చేసి
జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నా!

ప్రజల నెత్తి మీద
పేదరికం తాండవం చేస్తుంటే
ఆకలి పెను మంటై
తనువు దహించుకపోతే
ప్రశ్నించిన పాపానికి
ఊచలు లెక్కిస్తుంటే
అడగాల్సిన నేను
మెడలో దండలేసుకుని
ఊరేగుతూ
తలరాతలు మార్చినట్లు
సంబరపడుతున్నా!

ఇంద్రవెల్లి, బషీర్‌బాగ్
ముదిగొండ అడుగులో
అడుగులేస్తున్న కాళ్లను
నెత్తిన పెట్టుకొని
మోస్తున్న!
ఒక్కప్పుడు
న్యాయం కోసం, ధర్మం కోసం
నిప్పులు కక్కి
నేడు
అణగారిన ప్రజల
అస్థిపంజరాలపై
కార్పొరేట్‌కు బాటలేస్తున్న!

ఆకలి తీర్చుకొని
నడక నేర్చుకొని
నలుదిశలా పరిచయమై
మార్పు అనివార్యమని
జంధ్యాన్ని ప్రేమిస్తున్నాను
ఇదే.. అంతిమ లక్ష్యం అని
పేర్చిన శవాల గుట్టల కిందే
సేద తీరుతున్నాను..

నేను చేవ చచ్చిన పెన్నై
పుట్టినందుకు సిగ్గు పడుతున్నా!

ఎబిరెపల్లి కాశన్న
96400 06304

మాటల మధ్య నిశ్శబ్దం

> అఫ్సర్ కవిత్వానికి నలభై ఏండ్లు. ఇప్పటితరం వాళ్లు ఇన్నేండ్ల పాటు సాహిత్య ప్రయాణం చేయగలరా? అనే ప్రశ్న వేసుకున్నప్పుడు సందేహంగానే ఉంటుంది. 'రక్తస్పర్శ' నాటి అఫ్సర్ భౌతికంగా ఎలా ఉన్నాడో నాకు తెలియదు. మానసికంగా, ఉద్వేగంగా ఎలా ఉన్నాడో తెలుసుకోవాలంటే మాత్రం ఆ కవితా సంపుటే సాక్షి. తన 2వ కవితా సంపుటి 'ఇవాళ' నాటికి పరిస్థితులు మారాయి. అప్పటికి అఫ్సర్ మానసిక, సామాజిక అనుభవాలు వేరు. సామరస్య వాతావరణంలో మార్పులు వచ్చాయి. స్వేచ్ఛ దారి తప్పింది. 'వలస' నాటికి కవిత్వం ఒక గమ్యం కాదు, అది ఎప్పుడూ ఒక మజిలీ అని ప్రకటించుకున్నాడు. ఎప్పటికీ ఎవరూ వదిలించుకోలేని వర్తమానం కవిత్వానికి ప్రాణమని బలంగా నమ్మాడు. స్థల కాలాలను అన్వేషించకుండా ఏ కవీ కవిత్వం రాయడు. జీవితంలోని రంగులు తెలియాలి. వ్యవస్థలోని స్థాయీభేదాలు తెలియాలి. 80ల నాటి అఫ్సర్ వేరు, 90ల నాటి అఫ్సర్ వేరు. అఫ్సర్ అనే కవే కాదు, ఏ కవి అయినా నిలువ నీరులా ఉంటే పాఠకుల ముందు తేలిపోతాడు.

'వలస' కవిత సంపుటి నాటికి నేనొక విభిన్నమైన వాస్తవికతని, నేను స్త్రీని, నేను దళితుడిని, నేను మైనారిటీని, నేనో మూడవ ప్రపంచాన్ని, చివరికి నేనొక మనిషిని అని సొంత ఉనికిని చెప్పుకోవాల్సిన స్థితిలో పడిన సంక్లిష్ట అంతరంగాన్ని చూసి రోజులు గడిచే కొద్దీ భయపడుతున్నా, అనేక సమూహాల రేపటిని, అస్తిత్వవేదనని, జీవనయాతనను నేను, నేనొక అనేక వచనాన్ని అని చెప్పుకొన్నాడు. ఆయన కవిత్వ నిర్మాణాన్ని పరిశీలిస్తే ఖండికల ద్వారా పొరలు నిర్మించడం, ఆ పొరలను విప్పుకొంటూ పోవడం, ఈతచాప అల్లినట్టు, ఆకు ఆకు చేర్చి విస్తరి కుట్టినట్టు అల్లిక ఉంటుంది. పాఠకుడిలోకి సొచ్చుకుపోయే సరళపదాల భావాల జోడింపు అఫ్సర్‌లో గమనించవచ్చు.

ఆయన ఖమ్మం జిల్లా చింతకాని నుంచి అమెరికా వరకు జరిగిన, జరుగుతున్న పరిణామాలను, సంక్షోభాలను, ఖాళీలను చూస్తున్నాడు. లోపల అంచనాలు కడుతున్నాడు. ఆ అంచనాలకు తన సృజన ద్వారా కొత్తదనాన్ని ఇస్తాడు. ఆ అక్షరాలను కొత్త ఆలోచనలతో గాఢంగా ఎలా వ్యక్తీకరించాలో తనకు తెలుసు. అఫ్సర్ కవిత్వాన్ని మొదటినుంచీ ఇప్పటివరకు పరిశీలిస్తే ప్రపంచ చరిత్ర తాలూకు అనేక మార్పులకు సాక్ష్యాలు దొరుకుతాయి. సామాజిక పరిణామాలను అవగాహన చేసుకుంటూ సాగుతున్నాడు. అఫ్సర్ స్వరం లోతైనది. ఇప్పటి అఫ్సర్ కవిత్వంలో ఒక తాత్త్విక సంవేదన పాటలా వ్యాపిస్తుంది. రాలిపడిన క్షణాల చప్పుడును ప్రభావవంతంగా చిత్రీకరించడం చూడవచ్చు. ఈ పద్యాన్ని చూడండి...

> మాటల మీద నీకేమీ గౌరవమూ లేదు,
> పోనీ అనుకుంటే ప్రేమా లేదు.
> మాటలు నువ్వూలికే కట్టుకుంటూ వుంటావ్
> వాటిని యానిఫారాల మీద
> నక్షత్రాల పరువులాగా
> అలంకరించుకుంటూ వుంటావ్.

ఈ రోజుల్లో ఖాళీ అయిన మనుషులు, ప్రేమ రాహిత్యంతో కూడిన మనుషులు మాట్లాడే మాటలు ఇలాగే అభావంగా ఉంటాయని చెప్తున్నాడు. అఫ్సర్ శైలి గురించి మాట్లాడితే సరాసరి ఎదురుగా నిలబడిన, కూర్చున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్టుగా కవితలు ప్రారంభమవుతాయి. అఫ్సర్ పాఠకుడితో రిలేషన్‌ను ఇట్టే ప్రారంభించేస్తాడు. చివరివాక్యం వరకు తీసుకెళ్లి తన ప్రపంచం నుంచి పాఠకుణ్ణి అతడి ప్రపంచంలోకి తీసుకెళ్లగలడు.

అఫ్సర్ కవిత్వంలో ఉన్న మరొక లక్షణం క్లుప్తత. విరహం, దిగులు, నిరాశావాదం, జీవితం తాలూకు అన్వేషణ, జ్ఞాపకాలను పడవలా నీటిలో వదలడం ఇట్లాంటి లక్షణాలను ఎక్కువగా గమనించవచ్చు. అఫ్సర్ రంజాన్ మాసంలో రాసిన ఉపవాస పద్యాలు ఏ రోజుకారోజు ఫేస్‌బుక్ గోడల నుంచి కవిత్వ పాఠకుల గుండె గోడల్లోకి చొచ్చుకొనివెళ్లాయి.

1992 నాటి సంచలనాలు, 9/11 నాటి విపరీత పవనాలు, మెజారిటీ, మైనారిటీ భేదాలు ఇవన్నీ ఆయన హృదయంలో ఎప్పటినుంచో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆ ప్రకంపనల ప్రతిఫలం ఈ వొక్క పొద్దు పద్యాలు. చిక్కని కవిత్వ వ్యక్తీకరణ, నిజాయితీతో కూడిన వేదన, పాలస్తీనా శిథిలాల్లో చిక్కుకున్న పసిపిల్లల ముఖాల్లోని ఆవేదన, యుద్ధం సృష్టించే అశాంతి.. ఇట్లాంటివన్నీ ఉపవాస పద్యాల్లో అలవోకగా తొంగిచూశాయి. ఈ వాక్యాలన్నీ ఒక ధ్యానంలో నుంచి వచ్చినట్టుగా మనకు కనిపిస్తాయి. అంతర్జాతీయ వేదిక మీద నిలబడి తన అస్తిత్వాన్ని బలంగా చెప్పుకొనే అవకాశాన్ని అఫ్సర్ పొందాడు. తన ముందు పాఠం వినడానికి కూర్చున్న పాలస్తీనా, ఈజిప్ట్, అమెరికా లాంటి దేశాల విద్యార్థుల ముఖాల్లో ఆయన తన అప్పటి రోజుల ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. అఫ్సర్ ఈ పద్యాలను నేటి ముస్లింల కండ్ల వెను క తారట్లాడే కన్నీళ్లుగా చెప్తున్నాడు. బాధితుల తరపున వకాల్తా పుచ్చుకున్నాడు. ఈ పద్యాల్లో ఎక్కడా మనకు వ్యర్థపదాలు కనిపించవు. అనవసరంగా ఒక్క అక్షరమూ అనిపించదు.

ఇప్పటి అఫ్సర్ కవిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే పలికిన మాటల మధ్య పలకని మాటల నిశ్శబ్దంగా చెప్పవచ్చు. ఆయన కవిత్వానికి ప్రతిబింబం ఈ వాక్యాలు..

డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

'కాస్త ప్రేమా కాస్త స్నేహమూ
కాస్త సంతోషమూ... నీ కోసమే వీచే గాలి
నీ వెంటే నడిచే ఆకాశమూ
నిన్ను మాత్రమే పాడే పాట
చిటికెన వేలు వొదలని నీడా'

(ఈ నెల 14వ తేదీన 'ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ' పురస్కారాన్ని కవి అఫ్సర్ అందుకున్న సందర్భంగా...)